సాక్షి కర్నూలు

శనివారం : 12 : జూలై : 2025



పులికి ఉచ్చు బిగుస్తోంది!

ఉచ్చుల్లో చిక్కుకుని పులులు మృత్యువాత పడుతున్నాయి. నాగార్జున సాగర్ - శ్రీశైలం టైగర్ రిజర్వ్ అభయారణ్యంలో అటవీ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. 8లో▸



కోర్టుకెక్కిన బదిలీల వ్యవహారం

వ్యవసాయశాఖలో వీపీఏల బదిలీల వ్యవహారం కోర్టుకెక్కింది. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించలేదని వీపీఏలు హైకోర్టును ఆశ్రయించారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,624.86
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 76.031
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 41,932
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 40,657

న్యూస్‌రీల్

నేషనల్ హైవేస్ ఈఈగా విజయభాస్కర్‌రెడ్డి



కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లా నేషనల్ హైవేస్ ఈఈగా సి.విజయభాస్కర్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఈఈగా విధులు నిర్వహించిన శంకర్‌రెడ్డి ఎస్‌ఈగా పదోన్నతిపై విజయవాడ నేషనల్ హైవేస్ సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలోనే వైఎస్సార్ కడప ఎన్‌హెచ్ ఈఈగా విధులు నిర్వహిస్తున్న విజయభాస్కర్‌రెడ్డిని ప్రభుత్వం ఇక్కడకు బదిలీ చేసింది. నూతన ఈఈగా బాధ్యతలు చేపట్టిన ఈఈని ఎన్‌హెచ్ డీఈఈలు జగదీష్ గుప్త, రవిచంద్ర, ఏఈఈలు మునిస్వామి, భార్గవ్, శేఖర్, రవికాంత్, అసోసియేషన్ నాయకులు రమణ, కార్యాలయ సిబ్బంది పూలబోకేలు అందించి అభినందనలు తెలిపారు.

డీఈఈగా రవిచంద్ర బాధ్యతల స్వీకరణ

నేషనల్ హైవేస్ డీఈఈగా రవిచంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్‌అండ్‌బీలో కోడుమూరు సబ్ డివిజన్ డీఈఈగా విధులు నిర్వహిస్తున్న రవిచంద్రను ఎన్‌హెచ్‌కు బదిలీ చేస్తూ ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీరు నయీముల్లా ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి తెలుగు పరిరక్షణ సదస్సు



మాట్లాడుతున్న చంద్రశేఖర కల్కూర

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి తెలుగు భాష పరిరక్షణ సదస్సు శని, ఆదివారం రెండు రోజుల పాటు కర్నూలు నగరంలో నిర్వహిస్తున్నట్లు సదస్సు అధ్యక్షులు కె.చంద్రశేఖర కల్కూర తెలిపారు. శుక్రవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు పాల్గొంటారన్నారు. మొదటి రోజు ఉదయం 10 గంటలకు కొండారెడ్డి బురుజు సమీపంలోని తెలుగు తల్లి విగ్రహానికి పూల మాల వేసి అక్కడి నుంచి సదస్సు జరిగే వేదిక వరకు పాదయాత్ర ఉంటుందన్నారు. రెండో రోజు జరిగే సదస్సులో బోధనా భాషగా తెలుగు, మాతృ భాషగా తెలుగు, అధికార భాషగా తెలుగు, ప్రథమ భాషగా తెలుగు అనే అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. సదస్సు కన్వీనర్ పత్తి ఓబులయ్య మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరిగే సదస్సులో ప్రతినిధుల తీర్మానాలను జిల్లా కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి పంపుతామన్నారు. సమావేశంలో సదస్సు ఉపాధ్యక్షులు జేఎస్ ఆర్కే శర్మ, కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవీ తదితరులు పాల్గొన్నారు.

ఐదు పీఏసీఎస్‌ల పాలకవర్గాల ఏర్పాటుకు కసరత్తు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని మరో ఐదు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)కు పాలక వర్గాలను నియమించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎమ్మిగనూరు మండలం కడిమెట్ల, ఆదోని మండలం మదిర, పెద్దతుంబలం, పెద్దహరివనం, గోనెగండ్ల పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీల ఏర్పాటుకు ముందస్తుగా సభ్యుల వివరాలను పరిశీలించాలని డీసీవోను రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ ఆదేశించారు. ఇది వరకు 28 సంఘాల వివరాలను పంపగా.. జిల్లా అధికారులు పరిశీలన పూర్తిచేశారు. ఇందులో 24 సంఘాలను త్రీమెన్ కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై చర్యలు

కర్నూలు: జిల్లాలో మితిమీరిన వేగంతో ప్రమాదాలకు కారణమవుతున్న మైనర్లపై చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు కలిగిన మైనర్లు ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు నడిపినట్లు గుర్తిస్తే వాటి యజమానులు, తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మొదటిసారి పట్టుబడితే కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేస్తామని, రెండోసారి రూ.5 వేలు జరిమానా, మరోసారి పట్టుబడితే తల్లిదండ్రులకు జైలు శిక్ష తప్పదన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. గత ఆరు మాసాల్లో 171 మైనర్ డ్రైవింగ్ కేసులు నమోదు చేసి రూ.6.62 లక్షలు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

అవస్థలుబడి!

అసౌకర్యాల విద్య

- సంఖ్యా పరంగా రాష్ట్రంలోనే మొదటిస్థానం
- 3,630 మంది విద్యార్థినులతో కిటకిటలాడుతున్న పాఠశాల
- సరిపడా తరగతి గదులు లేక ఆరుబయట చదువులు
- మరుగుదొడ్ల కొరతతో తప్పని క్యూలు
- ఏడాదైనా అసంపూర్తిగానే అదనపు తరగతి గదులు



ఎమ్మిగనూరులోని ఎంఎస్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో చెట్ల కింద విద్యా బోధన

పాఠశాల విద్యలోనూ రాజకీయమే..



అసంపూర్తి తరగతి గదుల్లోనే కొనసాగుతున్న చదువులు

గత ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించడమే పనిగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వం పాఠశాల విద్యలోనూ రాజకీయం చొప్పించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కింద విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని ఏడాది కాలంగా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి. ఈ కారణంగా విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది.

ఎమ్మిగనూరు టౌన్: విద్యాభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాలతో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌ను తలదన్నేలా రూపుదిద్దుకున్నాయి. నాడు–నేడులో భాగంగా కల్పించిన మౌలిక సదుపాయాలతో అడ్మిషన్ల సంఖ్య కూడా మునుపెన్నడూ లేనివిధంగా పెరిగింది. దశాబ్దాలుగా శిథిలమైన పాఠశాలల్లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చొరవతో చూడచక్కని రూపాన్ని సంతరించుకుని విద్యార్థులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. ఇదే సమయంలో జగనన్న విద్యా కానుకతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించడంతో తల్లిదండ్రులు ప్రయివేట్ చదువులను మాన్పించి ప్రభుత్వ పాఠశాల దిశగా అడుగులు వేయించడం విశేషం.

విద్యార్థినుల అడ్మిషన్లలో రాష్ట్రంలోనే మొదటిస్థానం

ప్రస్తుత విద్యాసంవత్సరంలో జెడ్పీ పాఠశాలలో విద్యార్థినుల సంఖ్య 3,680. వీరిలో ఒక్క 6వ తరగతిలోనే కొత్తగా ప్రవేశానికి 850 మంది విద్యార్థినులు ప్రవేశం పొందడం విశేషం. ఫలితంగా ఈ ఒక్క తరగతికే 11 సెక్షన్లు నిర్వహిస్తున్నారు. విద్యార్థినుల సంఖ్య పరంగా ఈ పాఠశాల రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంది. 7వ తరగతిలో 680 మంది విద్యార్థినులకు 10 సెక్షన్లు, 8వ తరగతిలో 750 మందికి 10 సెక్షన్లు, 9వ తరగతిలో 700 మందికి 10 సెక్షన్లు, 10వ తరగతికి 9 సెక్షన్లతో బోధన సాగిస్తున్నారు. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా 94 మంది ఉపాధ్యాయులు ఇక్కడ పనిచేస్తున్నారు. ఇంకా 5 హిందీ, 6 ఒకేషనల్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది.

ఏడాదైనా పూర్తికాని అదనపు తరగతి గదులు

గత ప్రభుత్వ హయాంలో విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా రెండవ విడత నాడు–నేడు కింద 12 అదనపు తరగతి గదుల నిర్మాణానికి పూనుకుంది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పనులను పూర్తిగా విస్మరించింది. ఈ కారణంగా విద్యార్థినులు పాఠశాల ఆవరణలోని చెట్ల కింద, వరండాల్లో అష్టకష్టాలు పడుతూ చదువుకుంటున్నారు. ఇదే సమయంలో విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో నేల చదువులు తప్పడం లేదు. ఒకే తరగతి గదిలో కొందరు డెస్క్‌లపై, మరికొందరు నేలపై కూర్చోవడం వల్ల వివక్షను ఎదుర్కొంటున్నారు.

3,630 మంది విద్యార్థినులకు 22 మరుగుదొడ్లే..

రాష్ట్రంలోనే విద్యార్థినుల సంఖ్య పరంగా ఈ పాఠశాల మొదటిస్థానంలో ఉంది. మొత్తం 3,630 మంది విద్యార్థినీలు ఉన్న ఈ పాఠశాలలో 22 మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. ఈ కారణంగా విద్యార్థినీలు అత్యవసరమై మరుగుదొడ్లను ఉపయోగించుకోవాల్సి వస్తే క్యూలో నిల్చోవాల్సిన దుస్థితి నెలకొంది. సంఖ్యకు అనుగుణంగా మరో 20 మరుగుదొడ్లు అవసరం కాగా, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించని పరిస్థితి. ఇక విద్యార్థినుల సంఖ్య అధికంగానే ఉన్నప్పటికీ కేవలం నలుగురు మాత్రమే ఆయాలు పని చేస్తున్నారు. ఈ కారణంగా పాఠశాలలో పారిశుద్ధ్య లోపం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది.

నాడు–నేడు రెండో విడతకు రూ.2.08కోట్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మొదటి విడత నాడు–నేడు కింద టాయిలెట్స్ ఇతర మౌలిక సదుపాయాలకు రూ.1.01కోట్లు మంజురు కాగా ఆయా పనులన్నీ పూర్తయ్యాయి. ఇక రెండో విడత నాడు–నేడు కింద 20 అదనపు తరగతి గదులకు రూ.2.08కోట్లు మంజూరయ్యాయి. కాగా అందులో 8 తరగతి గదులు అసంపూర్తిగా ఉన్నాయి. ఆయా గదుల బయట ప్లాస్టింగ్ చేయకపోయినా సున్నం కొట్టించి వాటిలోనే తరగతులను నిర్వహిస్తున్నారు. మిగిలిన 12 గదుల నిర్మాణాలు పిల్లర్లకే పరిమితమయ్యాయి. ఏడాది కాలంగా ప్రస్తుత ప్రభుత్వం వీటిని పట్టించుకోకపోవడం గమనార్హం.



నిరుపయోగంగా ఆర్‌ఓ ప్లాంట్

పాఠశాలలో అన్నీ సమస్యలే..

- ఇక్కడ ఆర్‌ఓ ప్లాంట్ గత ఏడాది నుంచి పనిచేయక మూలనపడింది.
- విధిలేని పరిస్థితుల్లో విద్యార్థినీలు ఇంటి నుంచి బాటిళ్లలో నీళ్ల తెచ్చుకోవాల్సి వస్తోంది.
- మధ్యాహ్న భోజన సమయంలో వెక్కిళ్లు వస్తే వీళ్ల పరిస్థితి వర్ణనాతీతం.
- వర్షాకాలంలో పాఠశాల ఆవరణ తడిచి ముద్దవుతోంది.
- గ్రౌండ్‌లోనూ వర్షం నీరు నిలుస్తుండటంతో అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి.



ఈ విద్యార్థినీలు మరుగుదొడ్లను వినియోగించుకునేందుకు ఇలా క్యూలో నిల్చొన్నారు. పాఠశాలలో 3,630 మంది విద్యార్థినీలు ఉండగా 22 మరుగుదొడ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో విధిలేని పరిస్థితుల్లో విద్యార్థినీలు ఇలా క్యూలో నిల్చొని ఎదుర్కొంటున్న అవస్థలు వర్ణనాతీతం.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మా పాఠశాలలో విద్యార్థినీల సంఖ్యకు తగ్గట్టుగా తరగతి గదుల్లేవు. నాడు–నేడు కింద నిలిచిపోయిన 12 తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు నివేదించాం. పాఠశాల అభివృద్ధికి దాతలు కూడా ముందుకొస్తున్నారు. అధికారుల ఆదేశాలతో అవసరమైతే వారి సహకారం కూడా తీసుకొంటాం. అదనపు మరుగుదొడ్లు అత్యవసరం.

– కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయులు, ఎంఎస్, జెడ్పీ బాలికల హైస్కూల్, ఎమ్మిగనూరు

ప్రభుత్వం ఎప్పుడు మేల్కొంటుందో?



మరుగుదొడ్లకు వెళ్లేందుకు కూడా విద్యార్థినులు క్యూలో నిల్చోవాల్సిన దుస్థితి చూస్తే ఈ ప్రభుత్వం ఎంతటి దిగజారుడు పాలన సాగిస్తుందో అర్థమవుతోంది. విద్యార్థుల విషయంలో కూడా రాజకీయం చేయడం సిగ్గుచేటు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సర్కారు పాఠశాలలను బలోపేతం చేసే దిశగా అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టింది. ప్రస్తుత ప్రభుత్వం వీటిని పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఏడాది గడిచినా ఇప్పటికీ ప్రభుత్వం మేల్కొకపోవడం దారుణం.

– బుట్టా రేణుక, వైఎస్‌ఆర్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మిగనూరు

మోసానికి బ్రాండ్ చంద్రబాబు!

- దళిత సర్పంచ్‌ను అవమానించడం దారుణం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి తదితరులు



హాజరైన పార్టీ కార్యకర్తలు, నాయకులు

ఆదోని టౌన్: ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయకుండా మోసానికి బ్రాండ్‌గా టీడీపీ అధినేత చంద్రబాబు నిలిచారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదోని మండలం ఢణాపురం గ్రామంలో దళిత సర్పంచ్‌ను సమావేశానికి పిలిచి 'కూటమి' నేతలు అవమానించడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో వారికి ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. ఆదోని పట్టణంలోని రోషన్ గార్డెన్‌లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆదోని నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శశికళ, ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరి హాజరయ్యారు. సమావేశంలో ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆదోనిలో మెడికల్ కళాశాల నిర్మాణం ప్రారంభమైందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ఆధునీకరణ, నాడు–నేడు పథకాల కింద పాఠశాలల భవన నిర్మాణాలు జరిగాయని తెలిపారు. ఆదోని అభివృద్ధికి సాయన్న ఎంతో కృషి చేశారన్నారు. సాయన్న సేవలు అభినందనీయమన్నారు.

అధైర్యపడొద్దు

'కూటమి' నేతలు అనేక విధాలుగా వేధిస్తున్నారని, ఎవరూ అధైర్యపడొద్దని ఎస్వీ మోహన్‌రెడ్డి అన్నారు. ఆదోనిలో సాయన్న, కర్నూలులో తాను, రాష్ట్ర స్థాయిలో జగనన్న లీగల్ టీం అండగా ఉంటుందన్నారు. పార్టీ పటిష్టతకు, ప్రజా సమస్యల పరిష్కారానికి ధైర్యంగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. 'కూటమి' ప్రభుత్వం ప్రజల ఆగ్రహానికి గురి కావాల్సిందేనన్నారు.

ఉద్యోగాలు ఏవీ?

ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ.. ఎన్నికల ముందు బాబు వస్తే జాబు వస్తుందని, యువతకు నిరుద్యోగభృతి, ఉద్యోగ అవకాశాలు వస్తాయని నమ్మబలికి అధికారం చేపట్టిన తర్వాత మోసం చేశారన్నారు. బాబు పాలనలో ప్రజలకు రూ.81 వేల కోట్ల అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లికి వందనం పేరుతో తల్లులను మోసం చేశారన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఆదిలోనే హంసపాదు అయినట్లయ్యిందన్నారు. సమావేశంలో న్యాయవాదులు జీవన్‌సింగ్, శబరీష్, ఫయాజ్‌అహ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకులు దేవా, యేసేబు, వై.పి.గంగాధర్, వీరారెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఐఓగా జి.లాలెప్ప



కర్నూలు సిటీ: ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారిగా జి.లాలెప్పను నియమిస్తూ శుక్రవారం ఇంటర్మీడియెట్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ప్రాంతీయ కార్యాలయ అధికారిగా సి.సురేష్ బాబు పని చేస్తున్నారు. ఈయనకు త్వరలోనే ఇంటర్మీడియేట్ బోర్డు ఆర్జేడీగా పదోన్నతి రానుండడంతో ఆయన స్థానంలో కెవిఆర్ బాలికల జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా పని చేస్తున్న జి.లాలెప్పకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన శుక్రవారం సాయంత్రం ఆర్‌ఐఓగా విధుల్లో చేరారు. లాలెప్ప 1998లో గణితం అధ్యాపకులుగా ఉద్యోగంలో చేరి గుంతకల్లు, ఓర్వకల్లు ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పని చేశారు. 2013లో అధ్యాపకుడి నుంచి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందారు. కెవిఆర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా పని చేస్తూ అనంతపురం కేఎస్‌ఆర్ జూనియర్ కాలేజీకి బదిలీ అయ్యారు. ఆ తరువాత కర్నూలు కెవిఆర్ బాలికల కాలేజీకి బదిలీపై వచ్చి ప్రస్తుతం అక్కడే పని చేస్తున్నారు.

గోడ కూలి బాలుడి మృతి



మృతి చెందిన మహ్మద్‌హారిఫ్

పాణ్యం: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామంలో పాత గోడ కూలి ఐదేళ్ల బాలుడు మరణించాడు. ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపిన వివరాలివీ.. గ్రామానికి చెందిన కరిముల్లాకు ఇద్దరు కుమార్తెలు సంతానం. మొదటి కుమార్తె షాహీన్‌కు పెద్దకొప్పెర్లకు చెందిన మాబాషాతో వివాహమైంది. వీరికి మహ్మద్ హారిఫ్(5)తో పాటు తమ్ముడు, చెల్లెలు సంతానం. శుక్రవారం కరిముల్లా కూలీ పనులకు వెళ్తుండగా ఆయనతో పాటు హారిఫ్ కూడా వెంట వెళ్లాడు. ఇదే గ్రామానికి చెందిన నాగేశ్వరరెడ్డికి సంబంధించి పాతమిద్దెను తొలగిస్తున్నారు. పై నుంచి తొలగించేందుకు కట్టెలతో సార్వ వేసుకున్నారు. గోడలు పాతబడడంతో సార్వ, గోడ కూలిపోయింది. అప్పటికే తాత వెంట వచ్చిన మహ్మద్ హారిఫ్ గోడ వద్దనే ఉన్న విషయాన్ని గమనించలేదు. సార్వపై ఉన్న కరిముల్లా, శేషిరెడ్డితో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు బాలుడి కోసం వెతుకుతూ రాళ్లను తొలగిస్తుండగా వాటి మధ్య రక్తపు మడుగులో కనిపించాడు. వెంటనే నంద్యాల జీజీహెచ్‌కు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

హైకోర్టు న్యాయమూర్తికి ఘన స్వాగతం



ఓర్వకల్లు: కర్నూలు ఎయిర్‌పోర్టులో శుక్రవారం ఉదయం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయికి జిల్లా అధికారులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ విద్యా సాగర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

పొలంబడి కార్యక్రమాల తగ్గింపు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ పొలంబడులకు తిలోదకాలు ఇస్తోంది. 2025–26 సంవత్సరానికి పొలంబడులను కూటమి ప్రభుత్వం మరింత కుదించింది. 20 మండలాల్లో మండలానికి ఒకటి ప్రకారం సాధారణ పొలంబడి కార్యక్రమాలు, 5 మండలాల్లో మండలానికి ఒకటి ప్రకారం గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్(గ్యాప్) పొలంబడులు నిర్వహిస్తోంది. 2019–20 నుంచి 2023–24 వరకు వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఆర్‌బీకే పరిధిలో ఒక పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించి రైతులు వ్యవసాయంలో రాణించే విధంగా తోడ్పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత 2024–25లో గ్యాప్ కింద ప్రతి మండలంలో ఒక పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆహార పంటల్లో కెమికల్స్ వినియోగం తగ్గించే విధంగా గ్యాప్ పొలంబడి కార్యక్రమాలు నిర్వహించి.. పండించిన ఉత్పత్తులను గుంటూరు లామ్‌లోని ల్యాబ్‌కు పంపి పరీక్షలు నిర్వహించింది. కెమికల్స్ లేవని నిర్ధారణ అయితే ఆర్గానిక్ ఉత్పత్తులుగా సర్టిఫికేషన్ ఇచ్చేది. 2024–25లో తూతూ మంత్రంగా పొలంబడి కార్యాక్రమాలు నిర్వహించడంతో రైతులు ఇష్టారాజ్యంగా కెమికల్స్ వినియోగించినట్లు తెలుస్తోంది. గత ఏడాది పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఈసారి గ్యాప్ పొలంబడులను కేవలం ఐదు మండలాలకే పరిమితం చేసింది. మంత్రాలయం, ఆలూరుల్లో పత్తి, గూడూరు మండలంలో కంది, కౌతాళం మండలంలో వరి, వెల్దుర్తి మండలంలో వేరుశనగ పంటల్లో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ కింద పొలంబడులు నిర్వహిస్తారు. ఈ మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో సేంద్రియ పద్ధతుల్లో ఆయా పంటలు సాగు చేస్తారు. పండించిన పంటల నుంచి శాంపిల్స్ తీసి గుంటూరు ల్యాబ్‌కు పంపనున్నారు. కెమికల్స్ లేవని నిర్ధారణ అయితే సర్టిఫికేషన్ జారీ అవుతుంది. మిగిలిన మండలాల్లో సాధారణ పొలంబడులు నిర్వహించనున్నారు.

సాగర్‌కు కొనసాగుతున్న వరద



స్పిల్‌వే నుంచి పరుగులు పెడుతున్న కృష్ణమ్మ

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం మూడు రేడియల్ క్రస్ట్‌గేట్ల నుంచి కృష్ణా జలాలు దిగువకు పరుగులు పెడుతున్నాయి. గురువారం నుంచి శుక్రవారం వరకు జూరాల, సుంకేసుల ప్రాజెక్ట్‌ల నుంచి శ్రీశైలానికి 1,75,422 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. జలాశయం నుంచి దిగువ ప్రాజెక్ట్‌లకు 1,69,859 క్యూసెక్కుల నీరు విడుదలైంది. నార్జున సాగర్‌కు విద్యుత్ ఉత్పత్తి అనంతరం, క్రస్ట్ గేట్ల ద్వారా 1,48,259 క్యూసెక్కులు, బ్యాక్‌వాటర్ నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,600 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ ద్వారా 20,000 క్యూసెక్కులను వదిలారు. కుడిగట్టు కేంద్రంలో 17.264 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 17.397 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేశారు. శుక్రవారం సాయంత్రం సమయానికి జలాశయంలో 203.8904 టిఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 882.90 అడుగులకు చేరుకుంది.

క్లుప్తంగా

తల్లీకుమారుడు అదృశ్యం


కుమారుడితో ఉమాదేవి

కోసిగి: జంపాపురం గ్రామానికి చెందిన కాపు పురుషోత్తం రెడ్డి భార్య ఉమాదేవి తన రెండున్నర ఏళ్ల కుమారుడు యశ్వంత్ రెడ్డి రెండు రోజులుగా కనిపించడం లేదు. ఈనెల 9వ తేదీన ఇంటి నుంచి బయటకు వచ్చిన ఆమె ఉదయం 11 గంటలకు కోసిగి రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అక్కడ చెన్నై మెయిల్ ఎక్కి వెళ్లినట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ తెలియరాలేదు. బంధువులు పలు ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేక పోయింది. దీంతో కుటుంబీకులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు సీఐ మంజునాథ్, ఎస్ఐ హనుమంత రెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121101154, 9121101155కు సమాచారం ఇవ్వాలన్నారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని..

- విద్యార్థి ఆత్మహత్య

దేవనకొండ: సెల్ ఫోన్ కొనివ్వలేదని ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బంటుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సంజీవుడు, రాధమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వ్యవసాయ కూలీలుగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. చిన్న కుమారుడు శ్రీనాథ్‌గౌడ్(16) ఇటీవల పదో తరగతి పూర్తి చేశాడు. అయితే ఫోన్ కొనివ్వాలని తల్లిదండ్రులను పదేపదే అడిగాడు. తమ వద్ద ప్రస్తుతం డబ్బులు లేవని, ఉన్నప్పుడు కొనిస్తామని చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన శ్రీనాథ్‌గౌడ్ గత నెల 9వ తేదీన పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నెల రోజులుగా చికిత్స పొందుతూ కోలుకోలేక చివరకు ఈనెల 10వ తేదీన మృతిచెందినట్లు దేవనకొండ పోలీసులు శుక్రవారం తెలిపారు.

భార్యను కాపురానికి పంపలేదని..


చికిత్స పొందుతున్న బళ్లారప్ప

కోసిగి: ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామానికి చెందిన దేవమ్మ, ఏకాంబరం దంపతుల కుమారుడు బళ్లారప్ప అనే యువకుడు ఆత్మహత్యకు యత్నించాడు. ఇతనికి నాలుగు నెలల క్రితం కోసిగి మండలం మూగలదొడ్డి గ్రామానికి చెందిన వీరేశమ్మతో వివాహమైంది. ఇటీవల గ్రామంలో జరిగిన మొహర్రం పండుగ కోసం భార్య పుట్టింటికి వెళ్లింది. గురువారం గ్రామానికి వచ్చిన బళ్లారప్ప.. భార్యను తనతో పంపాలని కోరగా.. గురుపౌర్ణమి ఉండటంతో రెండు రోజుల ఆగి పంపిస్తామని భార్య కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో మనస్తాపానికి గురై శుక్రవారం ఉదయం మూగలదొడ్డి గ్రామంలో పొలాల వైపు వెళ్లి పురుగు మందు తాగి ఆపస్మారక స్థితిలో పడి పోయాడు. స్థానికులు గమనించి 108 వాహనంలో ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పులికి ఉచ్చు బిగుస్తోంది!


2022 జులై 8న ఉచ్చుకు బలైన ఆడపులి (టీ48) కళేబరానికి దహనం చేస్తున్న అధికారులు

- నల్లమలలో జింకల వేటగాళ్లు
- నీటి వనరుల ప్రాంతాల్లో ఉచ్చులు వేస్తున్న వైనం
- పులులు చిక్కుకుని మృత్యువాత
- మూడేళ్లలో రెండు మృతి
- ఇటీవల ఉచ్చుకు చిక్కుకుని బయట పడిన మరొకటి

ఆత్మకూరు రూరల్: నాగార్జున సాగర్ – శ్రీశైలం టైగర్ రిజర్వ్ అభయారణ్యం (ఎన్ఎస్‌టీఆర్)లో పులులు సంరక్షణపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. పులులు ఉచ్చుల్లో చిక్కుకుని మృత్యువాత పడుతున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నల్లమలలో వన్యప్రాణుల వేటగాళ్లు సంచరిస్తున్నారనేందుకు ఇటీవల జరిగిన సంఘటనే నిదర్శనంగా నిలుస్తోంది. జింకలకు వేసిన ఉచ్చుల్లో పులులు చిక్కుకుని ప్రాణాలు కోల్పోతున్నాయి.

ప్రస్తుతం నల్లమలలోని నాగార్జున సాగర్ – శ్రీశైలం టైగర్ రిజర్వ్ అభయారణ్యంలో పులుల సంఖ్య 87కు చేరుకున్నాయి. కాని ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనల్లో దేశంలో పులుల అసహజ మరణాలు పెరిగి పోతుండటం వన్యప్రాణి ప్రేమికులకు ఆందోళన కలిగిస్తున్నాయి. దేశ వ్యాప్తంగా గడిచిన మూడేళ్లలో పదులసంఖ్యలో పెద్దపులులు మరణించాయి. అలాగే మూడేళ్లలో నల్లమలలో రెండు పులులు అసహజ మరణం పొందగా అవి రెండు కూడా వేటగాళ్లు పన్నిన ఉచ్చులకు బలైనట్లు తెలుస్తోంది. ఇటీవల మరో పులి కూడా ఉచ్చుకు చిక్కుకుని తీవ్రమైన గాయంతో తప్పించుకుంది. అయితే గాయంతో అడవిలో తిరుగుతూ అటవీ సిబ్బందికి కనిపించంతో దానికి మత్తుసూదితో అపస్మారకంలోకి తీసుకు వెళ్లి బిగుసుకున్న ఉచ్చును తొలగించి గాయానికి చికిత్స చేశారు. అయితే బిగిసిన ఉచ్చు కారణంగా మెడలో ఉన్న అన్నవాహికకు లోతైన గాటు పడడంతో పాటు ఇన్‌ఫెక్షన్ సమస్యలు గుర్తించడం జరిగింది. స్థానిక వన్యప్రాణి వైద్య నిపుణుల సూచన మేరకు గాయపడిన పులిని తిరుపతి జూకు తరలించి అక్కడ పశువైద్య కళాశాలకు చెందిన డిపార్ట్ మెంటల్ హెడ్స్ చేత సర్జరీ నిర్వహించారు. తిరుపతి జూలో గాయపడిన పులికి ఆంటి బయాటిక్స్ ఇస్తూ చికిత్స కొనసాగిస్తున్నారు.ద్రవాహారంతో ఆపులి కోలుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఆ మూడు పులులు ఆడవే..



నల్లమలలోని ఎన్ఎస్‌టీఆర్ ఆత్మకూరు అటవీ డివిజన్‌లో ఉచ్చులకు చిక్కి మరణించిన రెండు పులులు టీ48, టీ123లతో పాటు ఉచ్చు బిగిసి ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న పులి కూడా ఆడపులే కావడం విషాదం. పులుల ప్రవర్ధనంలో ఆడ పులి ఎంతో పాధాన్యత కలిగి ఉంటుంది. ఒక ఆడ పులి తన జీవిత కాలంలో కనీసం 12 పులులకు జన్మనిస్తుంది. మరణించిన పులులన్నీ కూడా 4 నుంచి 8 సంవత్సరాలలోపువే కావడం గమనార్హం. నాలుగేళ్ల వయస్సులో సంతానోత్పత్తికి సిద్ధమయ్యే ఆడపులుల మరో నాలుగేళ్ల తన పిల్లలను పెంచి పెద్ద చేసి తిరిగి మరో మారు సంతానోత్పత్తికి సిద్ధపుడుతుంది.ఈ లెక్కన ఒకసారి సంతానోత్పత్తి జరిపిన తరువాతో లేక సిద్ధమవుతున్న సమయంలోనో ఈ పులులు మరణించాయి. దీంతో ఒక్కో పులి కనీసం 10 పిల్లలకు జన్మనిచ్చే అవకాశం కోల్పోయాయి.

ఉచ్చుల చిక్కులు తప్పించ లేరా?..

నల్లమల అడవుల్లో పులులు లక్ష్యంగా పని చేసే వేటగాళ్ళు లేనప్పటికి పులి ఆహార జంతువులైన జింకల కోసం పన్నుతున్న ఉచ్చులకు పులులు చిక్కుతున్నట్లు అర్థమవుతుంది. సహజంగా నీటి వనరుల వద్ద, జేడ మైదానాల్లో (సాల్ట్ లిక్ ల్యాండ్స్) వేటగాళ్ళు ఉచ్చులు వేస్తుంటారు. ద్విచక్ర వాహనాల బ్రేక్, క్లచ్ వైర్లు ఉచ్చులుగా తయారు చేసి జంతువులు సంచరించే ప్రాంతాల్లో పొదల మాటున వీటిని ఏర్పాటు చేస్తారు. నీటికోసం, ఉప్పు నాకడం కోసం వచ్చే జంతువులు ఈ ఉచ్చుల్లో చిక్కుకుపోతాయి.అయితే తన ఆహార జంతువుల కోసం వచ్చే పులులు కూడా అపుడప్పుడు ఈ ఉచ్చులకు చిక్కు బడి పోతున్నాయి.కాగా పులి అత్యంత బలమైన జంతువు కాబట్టి ఈ ఉచ్చులను తెంచుకోగలుగుతున్నాయి. అయినప్పటికి ఆ ప్రయత్నంలో అవి ఉచ్చులు బిగుసు పోవడంతో తీవ్రంగా గాయపడుతు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాయి.

గేదెలతో ఉచ్చుల తొలగింపు ఇలా..

పులులభయారణ్యాలలో మానవ సంచారం నిరోధించాలనే మౌలిక నిబంధనల మేరకు అటవీ ప్రాంతాల చుట్టు పక్కల గ్రామాలకు చెందిన పశువులను అడవుల్లో మేతకు అనుమతించడం లేదు. సహజంగా పశుగ్రాసం కోసం గ్రామీణ ప్రాంతాల వారు తమ పశువులను అడవుల్లోకి పంపుతుంటారు. పులుల అభయారణ్యాలలో పశువులు మేత కోసం తిరుగుతుంటే ఉచ్చులకు తగులు కోవడం ద్వారా వాటి ఉనికిని బట్టబయలు చేయగలుగుతాయి. పశు కాపరులు ఈ విషయాన్ని అటవీ సిబ్బందికి చేరవేయ గలుగుతారు. అంతే కాకుండా అడవుల్లోకి వచ్చే అనుమానాస్పద వ్యక్తుల గురించి సమాచారం అందించే వీలు కూడా ఉంటుంది. కాబట్టి పశువుల కాపర్ల సేవలను కూడా పులి సంరక్షణలో వినియోగించుకోవాలని వన్యప్రాణి ప్రేమికులు అభిప్రాయ పడుతున్నారు.

ట్రాక్టర్ కింద పడి కార్మికుడి మృతి

కొలిమిగుండ్ల: మదనంతపురం సమీపంలో ట్రాక్టర్ కింద పడి ఓ కార్మికుడు శుక్రవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. అంకిరెడ్డిపల్లెకు చెందిన బండ శ్రీరాములు(72) ట్రాక్టర్‌కు నాపరాళ్ల లోడ్ చేసేందుకు మదనంతపురం సమీపంలోని నాపరాతి గనిలోకి వెళ్లాడు. రాళ్ల లోడ్ చేసుకొని ట్రాక్టర్‌లో ఇంటికి బయలు దేరాడు. మార్గమధ్యలో మలుపు వద్ద అదుపు తప్పి కింద పడిపోవడంతో ట్రాక్టర్ అతనిపై వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం తాడిపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ప్రమాద విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

తాగుబోతుల వీరంగం

కోడుమూరు రూరల్: వెంకటగిరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండు రోజులుగా తాగుబోతులు వీరంగం సృష్టిస్తున్నారు. పాఠశాల జరిగే సమయంలో తరగతి గదుల్లోకి వచ్చి ఇటు ఉపాధ్యాయులు, అటు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. తాగి పాఠశాలలోకి రాకూడదని, ఏదైనా ఉంటే మంచిగా వచ్చి మాట్లాడాలని ఉపాధ్యాయులు చెబుతున్నా పట్టించుకోకుండా వారిపై సైతం దూషణలకు దిగుతున్నారు. దీంతో చేసేది లేక శుక్రవారం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంతో పాటు, ఉపాధ్యాయులు కోడుమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చినప్పటి నుంచి గ్రామాల్లో బెల్ట్ దుకాణాలు విపరీతంగా పెరిగిపోయాయని, యువకులు మద్యం మత్తులో ఘర్షణలకు పాల్పడుతున్నారు.

రూ.27.50 కోట్లతో మూడు సింగిల్ రోడ్లు


పి.మహేశ్వరరెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ

కర్నూలు(అర్బన్): జిల్లాలో పూర్తి అధ్వాన స్థితికి చేరిన మూడు సింగిల్ రోడ్ల నిర్మాణానికి రూ.27.50 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపినట్లు ఆర్అండ్‌బీ ఎస్ఈ పి.మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మిగనూరు-మాల పల్లి-కోసిగి రోడ్డు (0/0 నుంచి 11/885 కిలోమీటర్ వరకు) నిర్మాణానికి రూ.6 కోట్లు, ధనాపురం-హోళగుంద రోడ్డు (0/0 నుంచి 25/490 కిలోమీటరు వరకు) రూ.14 కోట్లు, ఏజీ రోడ్ నుంచి పెద్దకడుబూరు రోడ్ (0/0 నుంచి 13/750 కిలోమీటరు వరకు) నిర్మాణానికి రూ.7.50 కోట్లు అవసరమవుతాయని అంచనాలు రూపొందించామన్నారు. ఈ రోడ్ల పనులు పూర్తయితే దాదాపు 10 నుంచి 20 గ్రామాల ప్రజల రాకపోకలకు ఉన్న ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. ఇప్పటికే పార్ట్ హోల్ ఫ్రీ కింద స్టేట్ హైవేస్‌లో రూ.862.32 లక్షలతో మొత్తం 63 పనులను పూర్తి చేశామన్నారు. అలాగే మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్స్‌కు సంబంధించి రూ.2128.64 లక్షలతో 179 పనులను పూర్తయ్యాయన్నారు.

రూ.17.37 కోట్లతో తొమ్మిది పీహెచ్‌సీ భవన నిర్మాణాలు

జిల్లాలోని తొమ్మిది ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవన నిర్మాణాలకు రూ.17.37 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు ఎస్ఈ తెలిపారు. ఒక్కో భవన నిర్మాణానికి రూ.1.93 కోట్లు వెచ్చించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే టెండర్లను ఆహ్వానిస్తామన్నారు.

మెడికల్ కాలేజీల్లో పరిశోధనలకు ప్రాధాన్యం

- ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పరిశోధనలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు డాక్టర్ ఎన్‌టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.చంద్రశేఖర్ చెప్పారు. శుక్రవారం ఆయన కర్నూలు మెడికల్ కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరి, రిక్రియేషన్ గదిని ప్రారంభించారు. అనంతరం హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిపార్ట్‌మెంట్‌ల వారీగా అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా అవసరాలను కళాశాలల్లోని నిధులతో మూడు నెలల్లో పూర్తి చేయాలన్నారు. వైద్యులు సబ్జక్టుల వారీగా అప్‌డేట్‌గా ఉండాలని, వారు సైతం క్రమశిక్షణ పాటించి విద్యార్థుల హాజరును పర్యవేక్షించాలని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ మెడికల్ కాలేజీకి రూ.1కోటి నిధులు ఇస్తున్నామని, వీటితో పరిశోధనలకు ప్రాదాన్యం ఇవ్వాలన్నారు. కర్నూలు, గుంటూరు, వైజాగ్‌లలోని కళాశాలల్లో ప్రమాణాలు పెంచేందుకు, వాటిని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అన్ని ప్రభుత్వ కళాశాలల్లో స్కిల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేయనున్నామని, పర్ల ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేయనున్నట్లు చెప్పారు. అకడమిక్ డీఎంఈ డాక్టర్ రఘునందన్ మాట్లాడుతూ వీసీ సహకారంతో మెడికల్ కాలేజీల్లో ప్రమాణాలు, పరిశోధనలు, వసతులు, వైద్య విద్యార్థుల కరిక్యులమ్ మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మెడికల్ కళాశాలలను తనిఖీలు నిర్వహించి అక్కడి ల్యాబ్‌లు, క్లినికల్ సౌకర్యాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సింధియా శుభప్రద తదితరులు పాల్గొన్నారు.

బిందుసేద్యం పరికరాలు ధ్వంసం

- బాధితురాలు వైఎస్సార్‌సీపీ కార్యకర్త


మాట్లాడుతున్న బాధితురాలు ఖైరున్‌బీ


ధ్వంసమైన డ్రిప్ సేద్యం ట్యాంక్, పైపులు

దేవనకొండ: కప్పట్రాళ్ల గ్రామానికి చెందిన షేక్ ఖైరున్ బీకి చెందిన పొలంలో బిందు సేద్యం పరికరాలు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. బుధవారం రాత్రి బిందుసేద్యానికి సంబంధించిన డ్రిప్ ట్యాంక్, పైపులు, మోటార్‌ను ధ్వంసం చేశారు. కాగా తాను వైఎస్సార్‌సీపీ కార్యకర్తనని, గతంలో పార్టీ మద్దతుతో వార్డు మెంబర్‌గా పోటీ చేశానని అప్పటి నుంచి టీడీపీ కార్యకర్తలు వేధిస్తున్నారరని ఖైరున్‌బీ శుక్రవారం విలేకరుల ఎదుట వాపోయింది. గ్రామానికి చెందిన చెరుకులపాటి మహేష్, కొండగిరి మధు, ఆటో గుడ్డికొలుట్లయ్య, ట్రాక్టర్ బోయ శేఖర్, కొండగిరి బద్రి తరచూ తమతో గొడవ పడేవారని, వారిపై అనుమానం ఉందన్నారు. గతంలో కూడా బోరుబావికి సంబంధించి కేబుల్ వైర్లు, స్టార్టర్ బాక్సులు కూడా అపహరించారన్నారు. దీనిపై దేవనకొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు న్యాయం చేయడం లేదని వాపోయారు.

డ్రైనేజీలో మహిళ మృతదేహం

- హత్యగా అనుమానం


పర్స్‌లో లభ్యమైన నగదు, షాంపులు

నంద్యాల: పట్టణంలో డ్రైనేజీలో గుర్తు తెలియని మహిళ శవం కనిపించడంతో స్థానికులు భయాందోళన చెందారు. టూటౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన మేరకు.. స్థానిక రామనాథరెడ్డినగర్ సమీపంలోని పార్కు వద్ద ఉన్న డ్రైనేజీలో శుక్రవారం గుర్తు తెలియని మహిళ శవాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతురాలి వయస్సు 40 నుంచి 45 సంవత్సరాలు ఉంటుంది. మహిళ మృతి చెంది నాలుగు రోజులై ఉండటంతో శరీరం ఉబ్బిపోయి గుర్తుపట్టలేని విధంగా మారింది. మృతురాలు ఐదు అడుగుల పొడవు, ఆకు పచ్చ లంగా, గులాబీరంగు రవిక, పూలడిజైన్ ఉన్న సిమెంట్ రంగు చీర ధరించింది. మృతురాలి రవికలో ఉన్న పరుసులో రెండు వందల నోట్లు 9, వందరూపాయల నోట్లు నాలుగు, రెండు తాళం చెవులు, కొన్ని షాంప్ ప్యాకెట్లు ఉన్నాయి. 36వ వార్డు వీఆర్‌ఓ ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మహిళ ఆచూకీ తెలిస్తే 9121101085ను సంప్రదించాలన్నారు. కాగా డ్రైనేజీ కాల్వలో మహిళ శవం వెలుగు చూడటంతో పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. మహిళను హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ పడేశారా.. మద్యం మత్తులు ఎవరైనా దాడి చేసి చంపేశారా..? కుటుంబ కలహాలతో హత్య చేశారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసుల దర్యాప్తులో వాస్తవాలు వెలుగు చూడనున్నాయి.

కోర్టుకెక్కిన వీఏఏల బదిలీల వ్యవహారం

- బదిలీల్లో తీవ్ర అన్యాయం జరిగిందని హైకోర్టు కెక్కిన వీఏఏలు
- తదుపరి ఉత్తర్వులు జారీ చేసే వరకు స్టేటస్ కో ఆదేశాలు జారీ



కర్నూలు(అగ్రికల్చర్)/ఉయ్యాలవాడ: వ్యవసాయ శాఖలో వీఏఏల బదిలీల వ్యవహారం కోర్టుకెక్కింది. ఇటీవల నిర్వహించిన వీఏఏల బదిలీల్లో అధికారులు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను పాటించలేదని, సీనియార్టీని పట్టించుకోలేదని, రాజకీయ సిఫారసులకు పెద్ద పీట వేశారని పేర్కొంటూ 20 మందికిపైగా వీఏఏలు హైకోర్టును ఆశ్రయించారు. వీఏఏల బదిలీలు ఉమ్మడి జిల్లా యూనిట్‌గా జరిగాయి. నంద్యాల జిల్లాలో పనిచేస్తున్న పలువురు వీఏఏలు ఎలాంటి ఆప్షన్ ఇవ్వకపోయినప్పటికీ కర్నూలు జిల్లాకు అలాట్ చేశారు. వారిని ఆదోని, కౌతాళం, పెద్దకడుబూరు తదితర మండలాలకు బదిలీ చేశారు.

➡ ఉయ్యాలవాడ మండలం మాయలూరు గ్రామ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకురాలు సుమలత గర్భిణీ. దొర్నిపాడు, కోవెలకుంట్లలోని మూడు రైతు సేవా కేంద్రాలకు ఆప్షన్ ఇచ్చారు. అయితే ఆమెను ఆదోని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని పెద్దకడుబూరు మండలంలోని మేకడోణకు బదిలీ చేశారు.

➡ తుడుమలదిన్నె గ్రామ వ్యవసాయ సహాయకురాలు రియాజున్ కొలిమిగుండ్ల మండలంలోని రెండు రైతు సేవా కేంద్రాలను ఆప్షన్‌గా ఎంచుకున్నారు. అయితే ఈమెను కర్నూలు జిల్లా కోసిగి మండలంలోని కందుకూరు రైతు సేవా కేంద్రానికి బదిలీ చేశారు.

➡ హరివరం గ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ సిద్దిక్ బాషా ఉయ్యాలవాడ, కోవెలకుంట్ల మండలంలోని మూడు సేవా కేంద్రాలకు ఆప్షన్‌గా ఇవ్వగా మంత్రాలయం మండలంలోని సుంకేశ్వరి రైతు సేవా కేంద్రానికి బదిలీ చేశారు. ఇలా దాదాపు 200 కిలో మీటర్ల దూరంలో వున్న గ్రామాలకు వెళ్లేందుకు ఇష్టం లేని వీరితో పాటు జిల్లాలో మరో 20 మంది గ్రామ వ్యవసాయ సహాయకులు హైకోర్టును ఆశ్రయించారు. తమ వినతులను అధికారులు వినిపించుకోలేదని కోర్టుకు విన్నవించారు. వీఏఏల వాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు కోర్టును ఆశ్రయించిన వీఏఏలను తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు కదిలించ వద్దని యథాస్థితి కొనసాగించాలని (స్టేటస్‌కో) ఆదేశాలు ఇచ్చింది.

ప్రభుత్వాలకు అభివృద్ధి పట్టదా!

- కూటమి ప్రభుత్వంలో రైతు సంక్షేమమేదీ?
- స్మార్ట్ మీటర్లపై చంద్రబాబు మాట మార్చారు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ఆలూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షేమాన్ని వదిలేసి, స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. శుక్రవారం ఆలూరులో స్థానిక పాతబస్టాండు ఆవరణలో నియోజకవర్గం సీపీఐ 12వ మహా సభలను సీపీఐ జిల్లా కార్యదర్శి కె. గిడ్డయ్య నేతృత్వంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కె.రామకృష్ణ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి రైతుకు ఏడాదికి పంటల సాగుకు అన్నదాత సుఖీభవ పేరుతో రూ. 20 వేలు జమచేస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు బాబు రైతులను మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతు సంక్షేమం కనిపించడం లేదన్నారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ విద్యుత్ మీటర్లు వద్దని డిమాండ్ చేసి ఇప్పుడు అదే మీటర్లు ఇంటింటికి అమర్చుతుండటం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఓట్ల కోసం ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు చెల్లుతుందన్నారు. సమావేశానికి సీపీఐ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధానకార్యదర్శి ఆవుల శేఖర్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్దిలేటిశెట్టి, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు భూపేష్, సీపీఐ జిల్లా నాయకుడు నబీరసూల్ తదితరులు హాజరయ్యారు.

పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయండి..

రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసినప్పుడే వ్యవసాయ రంగం గాడిలో పడుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం పైసా కేటాయించపోకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కూటమి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో సామాన్య ప్రజలు, రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. సమావేశానికి ముందుగా పురవీధుల్లో సీపీఐ నాయకులు, కార్యకర్తలతో కలసి ర్యాలీ నిర్వహించారు.

కుటుంబ గొడవలతో..


చికిత్స పొందుతున్న వడ్డే రామకృష్ణ

కోసిగి: స్థానిక బస్టాండ్ సమీపంలో వడ్డే వీదిలో నివాసం ఉంటున్న వడ్డే రామకృష్ణ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులతో గొడవ పడి మనస్థాపంతో ఇంట్లో తలుపు వేసుకుని ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కిందకు దించారు. అపస్మారక స్థితిలో ఉండటంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా.. డాక్టర్ రాజకిరీటి ప్రథమ చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఆదోనికి తరలించారు.